క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగామ మైత్రి ప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ సంస్థలైన ట్రాన్స్‌కాం ఇండస్ట్రీస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్ట్ ఇంజనీర్స్, ఐటీ సీ, ఓకే నో మోడ్ హోమ్స్ తదితర సంస్థల్లోని వంద ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి అర్హతగల అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనిలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలి.

ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ అలవడుతుంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి

గోల్కొండ: రంజాన్ ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ అలవడటంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్ మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి అన్నారు. రంజాన్ పవిత్ర ప్రార్థనల సందర్భంగా గోల్కొండ రిసాలబజార్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉపవాస దీక్షలకు ఎంతో అర్థం ఉందని, దీనివలన సంపూర్ణ ఆరోగ్యం లభించడమే కాకుండా దైవభక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్ రబ్బానీ, సయ్యద్ ఆజమ్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో పరిశోధనలు అత్యవసరం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఏజీవర్సిటీ: వ్యవసాయ రంగంలో పరిశోధన ,విస్తరణ విభాగాలు చాల ముఖ్యమైనవని.. వాతావరణ మార్పులు, నూతన టెక్నాలజీ విషయంలో రైతుల్లో విస్తృత అవగాహన కల్పించడానికి కృషి విజ్ఞాన కేంద్రాలు పని చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం,అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌లో 2023- 24 సంవత్సరానికి తెలంగాణలోని 16 కృషి విజ్ఞాన కేంద్రాలు అనుసరించాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఆమోదించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ పద్ధతులు,రైతు ఉత్పత్తి సంఘాలు వంటి విషయాలపై రైతుల్ని చైతన్యవంతుల్ని చేయాలని కేవీకే శాస్త్రవేత్తలకు సూచించారు.పరిశోధన సంచాలకులు వెంకటరమణ మాట్లాడుతూ పురుగు మందులు,ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించడానికి రైతుల ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. మారుతున్న కాలంలో వ్యవసాయంలో డిజిటలీకరణ ప్రాముఖ్యాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లాలని అగ్రికల్చరల్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏక్ ఎన్ మీరా చెప్పారు.బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఆర్‌కే సమంత మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలను మినీ అగ్రికల్చరల్ యూనివర్సిటీలుగా మార్చేందుకు కృషి చేయాలని, అదే విధంగా రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు, నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు ,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం.. సమస్యల ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో సభ్యులు ఏకరవు పెట్టారు. బుధవారం ఎంపీపీ జయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో కరెంటు, తాగునీటి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కరెంటు సమస్యలపై ఎన్నిసార్లు సభ దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు నిధులు కావాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీ రాజు, వైఎస్ ఎంపీపీ నీలం, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు చెక్కల ఎల్లయ్య, యాదయ్యగౌడ్, ఇందిరా, సంగీత, సర్పంచులు బుచ్చమ్మ, కల్పన, రాజ్‌కుమార్, సతీష్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి



కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రియాజ్ పాషా, ప్రధాన కార్యదర్శి రామకృష్ణగౌడ్‌లు మాట్లాడుతూ మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై దాడికి పాల్పడడం సహించరాని విషయమన్నారు. కేసు విషయం మాట్లాడుతుండగా సహనం కోల్పోయిన వ్యక్తి కోర్టు ప్రాంగణంలో దురుసుగా ప్రవర్తించాడని ,ఈ విషయాన్ని తాము రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. న్యాయవాదులకు ప్రత్యేకంగా రక్షణ అవసరమన్నారు. న్యాయవాది రవికాంత్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసనలో ఎస్.వెంకట్‌రెడ్డి, వి.వరప్రసాద్, ఎం .మధుకర్‌రెడ్డి, సిద్దేశ్వర్‌గౌడ్, అయ్యప్పన్‌రెడ్డి, గణేష్, బండయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు



అత్తాపూర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్, అధికారులు

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న తీరుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో బస్తీ పర్యటనలో భాగంగా బుధవారం అత్తాపూర్ ఓల్డ్ విలేజ్‌లో కార్పొరేటర్ ,అధికారులతో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీరుతో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లు, జలమండలి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని పరిస్థితి ఉందని, బిల్లులు రాక వారు లబోదిబో అంటున్నారన్నారు. కాంట్రాక్టర్లు బంగారం తాకట్టు పెట్టి, అప్పులు తెచ్చి పనులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దేశ్వర్, జీహెచ్‌ఎంసీ అధికారులు, జలమండలి అధికారులు, ఎంటమాలజీ అధికారులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

23న అక్షయ తృతీయ పూజలు

మణికొండ: అక్షయ తృతీయను పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ ఆదివారం అరుణాచల శివ సేవా సత్సంగం ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని తుల్జారాం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు దేవీ హోమం, రుద్రాభిషేకం, లక్ష్మీ కుబేర పూజ, సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 8గంటల వరకు విష్ణు సహస్రనామ పారాయణం , గోపూజ, అమ్మవారికి కుంకుమార్చన ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం 300మంది పేదలు, పండితులు, బ్రాహ్మణులకు అక్షయ తృతీయ దానం, అన్నదానం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దానం ఇవ్వ దలచిన వారు ఫోన్ నంబర్ 9652110433, 9985615805 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమం, సుభిక్ష పాలన బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్ నుంచి భారీ సంఖ్యలో యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయనను వారు భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన సూచించారు. గడపగడపకూ బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

అభివృద్ధిలో శంషాబాద్ ఆదర్శం



17 వార్డులో ముదిరాజ్ కమ్యూనిటీహాలు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్ తదితరులు

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

శంషాబాద్: అభివృద్ధి పనుల్లో శంషాబాద్ మున్సిపాలిటీ ఆదర్శంగా నిలుస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలో వివిధ వార్డుల్లో రూ. 4 కోట్ల నిధులతో సీసీ రహదారులు, సివరేజ్ డ్రైన్లు, కమ్యూనిటీహాలు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో రూ. 3.5 కోట్లు ఎమ్మెల్యే ఫండ్ నుంచి కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్‌ముదిరాజ్, అశోక్ అజయ్, మస్రత్‌జాన్,భారతమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తదితరులు

ఇఫ్తార్ విందులో అజారుద్దీన్

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ బుధవారం రాజేంద్రనగర్ డెయిరీ ఫామ్ వద్ద ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, సీనియర్ నాయకుడు ఫయిమ్, యువజన విభాగం నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు హాజరయ్యారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, అత్తాపూర్, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్‌కు చెందిన మైనార్టీలు విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజుద్దీన్, ఖాలేద్, ముద్దగౌని భాస్కర్‌గౌడ్, శేఖర్‌యాదవ్, డప్పు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కండరాల క్షీణత బాధితులను ఆదుకోండి



మంత్రి హరీశ్‌రావును కలిసిన కండర క్షీణత బాధితుల సంఘం నేతలు

మణికొండ: కండరాల క్షీణతతో ఇబ్బంది పడుతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ నేతలు కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నేతలు బాలకృష్ణ, రవికుమార్‌లు బుధవారం మంత్రి హరీష్‌రావును కలిశారు. ఈ సందర్భంగా వారు కండరాల క్షీణత బాధితులకు కేర్ టేకర్, కేర్ టేకర్ అలవెన్స్, ఆరోగ్య కార్డులు, న్యూట్రిషన్ కిట్లు, దశల వారీగా బ్యాటరీ వీల్ చైర్‌లు, మెడిసిన్ తదితరాలపై మాట్లాడారు. దీనికి స్పందించిన మంత్రి ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

వేము వందనకు పురస్కారం

రాజేంద్రనగర్: ప్రేమావతిపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త వేము వందనకు జాతీయ సాహిత్య పురస్కారం దక్కింది. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య వికాసానికి తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్.వి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పటాన్‌చెరు జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో జరగనున్న జాతీయ సాహిత్య సంబరాల్లో పురస్కారం అందుకోనున్నారు.

నియామకం



సోల్కర్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ శివరాంపల్లి ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు కొత్త సోల్కర్‌రెడ్డిని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ పార్టీ ఐటీ, సోషల్ మీడియా విభాగం కనీ్వనర్‌గా నియమించారు. బుధవారం రాజేంద్రనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింతగా చేరువయ్యేలా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్లమెంటు కన్వీనర్‌గా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైలైఫ్ హైదరాబాద్ సూచనలతో ఖాళీ స్థలాల అభివృద్ధి



ఖాళీస్థలాల అభివృద్ధిపై అధికారులతో మాట్లాడుతున్న వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య

వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలను హైలైఫ్ హైదరాబాద్ సూచనలు, సలహాలతో అభివృద్ధి చేస్తామని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, హైలైఫ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ అధీనంలో ఉన్న వంద చదరపు గజాల స్థలం నుంచి రెండు వందల చదరపు గజాల స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో కోటి రూపాయల వ్యయంతో ఖాళీ స్థలాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిరుపయోగంగా ఉన్న స్థలాలను వాడుకలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డి, ఉప కమిషనర్లు వెంకన్న, సుదాంష్, రమేష్, బాలయ్య, ఎస్‌ఈ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

కాలనీ కాంటాక్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని కాలనీ, బస్తీల సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ వెస్ట్ సిటీ, స్టాలిన్‌నగర్, గ్రీన్ వ్యాలీ, మక్తమహబూబ్‌పేట, సత్యనారాయణ ఎన్‌క్లేవ్, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, మియాపూర్ విలేజ్, ఫ్రెండ్స్ కాలనీ, పార్వతీనగర్, మయూరినగర్, దోవా కాలనీ, శీలా గార్డెన్స్ కాలనీలలో బుధవారం కాలనీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, ఉప కమీషనర్ సుదాంశ్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి వేదికన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డాక్టర్ కార్తీక్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్, ఏఈ శివప్రసాద్, ఎస్ఐ రవికుమార్, జలమండలి మేనేజర్ సాయి చరిత, ఎస్ఆర్పీ కనకరాజు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు రీ నోటిఫికేషన్ ఇవ్వాలి

నాంపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నాంపల్లిలోని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు డబుల్ పీజీ నిబంధన పెట్టి టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఈ అంశంపై కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో.. సింగిల్ పీజీ చేసిన వారిని కూడా అర్హులుగా పరిగణనలోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. అయితే కేవలం కోర్టును ఆశ్రయించిన వారికి మాత్రమే మే 17న జరిగే పరీక్షకు అనుమతి ఇచ్చారన్నారు. దీని కారణంగా కోర్టును ఆశ్రయించని మూడు వేల మంది అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. న్యాయస్థానం తీర్పుకు అనుగుణంగా సింగిల్ పీజీపై పీఈడీ పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇచ్చి అందరికీ అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మద్దతు తెలిపారు.

చెత్త ఆటోలతో కార్మికుల నిరసన

నిలిచిపోయిన చెత్త సేకరణ



బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చెత్త సేకరణ ఆటో కార్మికులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ నిలిచిపోయింది. రెండు రోజులుగా ఆటో రిక్షా కార్మికులు చెత్త సేకరించకుండా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. దీంతో చెత్తను సేకరించేవారు లేకపోవడంతో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతోంది. బుధవారం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో చెత్తసేకరించే 70 ఆటో రిక్షాలను నిలిపి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా బస్తీలు, కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నామన్నారు. కొత్త ఆటోరిక్షాలను పాత వారికి కేటాయించకుండా మాదాపూర్, కొండాపూర్, హైటెక్‌సిటీ నుంచి వచ్చిన కొత్త వారికి మున్సిపల్ కమిషనర్ కేటాయించారన్నారు. అంతేకాకుండా చెత్త సేకరిస్తున్న తమకు ఇళ్లను పూర్తిగా తగ్గించారని కార్మికులు వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని వాపోతున్నారు.

ఎమ్మెల్యేకు చెప్పినా...

తాము పడుతున్న ఇబ్బందులను గతవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి విన్నవించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి కొత్త వారు కాకుండా పాతవారే కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి చెత్తను సేకరించాలని ఆదేశించారన్నారు. అయినా అధికారులు ఎమ్మెల్యే మాటలను పట్టించుకోకుండా తమ సమస్యను పరిష్కరించడం లేదన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు తమ నిరసన విరమించేది లేదని వెల్లడించారు. కార్యక్రమంలో సుధాకర్, బసవ, మనోహర్, గోరంట్ల, రాజు తదితరులున్నారు.